క్లుప్తంగా

డాక్టర్ పద్మలత, శ్రీనివాస్‌కు పురస్కారాలు



అనుసూరి దంపతులను సత్కరిస్తున్న నాగాలాండ్ గవర్నర్ గణేశన్ తదితరులు

సీటీఆర్ఐ: ప్రపంచ తెలుగు మహాసభల్లో అందించిన సేవలకుగాను నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు, శ్రీలత ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ అనుసూరి శ్రీనివాస్, డాక్టర్ పద్మలత దంపతులకు సేవా పురస్కారాలు లభించాయి. మూడు రోజుల పాటు గైట్ కళాశాలలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో డాక్టర్ అనసూరి దంపతులు వైద్యపరంగా, సభలు విజయవంతం కావడానికి తమవంతు సహకారం అందించారు. అలాగే వారు కోవిడ్ సమయంలో అనే సేవలు అందించారు. వాటికి గుర్తింపుగా మహాసభల నిర్వాహకులు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల అధినేత చైతన్య రాజు సారథ్యంలో సేవా పురస్కారాలకు వీరిని ఎంపిక చేశారు. సభలకు హాజరైన నాగాలాండ్ గవర్నర్ ఎల్ఏ గణేశన్ చేతుల మీదుగా డాక్టర్ అనసూరి పద్మలత, డాక్టర్ శ్రీనివాస్ అందుకున్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

కడియం: ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం పది గంటలకు వైఎస్సార్ దళిత నాయకుల ఆత్మీయ సమావేశం జరగనుంది. ఈ మేరకు వేమగిరిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కు వద్ద సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశానికి రూరల్ కో ఆర్డినేటర్, మంత్రి వేణును ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో యాదల సతీష్ చంద్ర స్టాలిన్, బడుగు ప్రశాంత కుమార్, పెయ్యల రాజేష్, విప్పర్తి ఫణి కుమార్, అనిల్, తలారి ప్రసాద్, గోలి దేవ తదితరులు పాల్గొన్నారు.


మానసిక చికిత్స కేంద్రం సందర్శన



కేంద్రాన్ని సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని మానసిక చికిత్స కేంద్రాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి సోమవారం సందర్శించారు. ఆ విభాగంలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని, తిరిగి వారి కుటుంబ సభ్యుల్లో కలిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా అందిస్తామన్నారు. మానసిక రోగులు వైద్యుల సలహాలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చన్నారు.

జాతీయ టీటీ పోటీలకు ఎంపిక



ప్రభాత్ సాయి

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): నగరానికి చెందిన తీగిరెడ్డి శ్రీప్రభాత్‌సాయి జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీ కోచ్ వీటీవీ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కోల్‌కతా నేతాజీ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ 85వ అంతర్రాష్ట్ర యూత్ అండ్ జూనియర్ జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ పోటీల అండర్–19 విభాగంలో ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టుకు సాయి కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని, వ్యక్తిగత విభాగంలో కూడా పాల్గొంటాడని వివరించారు. గత ఏడాది రాష్ట్రంలో జరిగిన వివిధ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజయం సాధించడం ద్వారా సాయి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అతడిని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్, అకాడమీ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి అభినందించారు.

వారిద్దరికీ సంపూర్ణ మద్దతు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎంపీలు జీవీ హర్షకుమార్, ఉండవల్లి అరుణ్ కుమార్ ఏ పార్టీ నుంచి పోటీ చేసినా తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ ఎంపీ లగడపాటి రాజ్‌గోపాల్ అన్నారు. రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ హర్షకుమార్‌ను సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజనతో ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించానని, దానికి కట్టుబడి ఉన్నానన్నారు.

పండగ తర్వాత సీట్ల ప్రకటన

సీటీఆర్ఐ: పండగ తర్వాత సీట్లు ప్రకటించే అవకాశం ఉందని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక జేఎన్ రోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొత్తులో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసే సీట్ల సర్దుబాటు చేస్తారన్నారు.

సైలెన్స్ ప్లీజ్...



అధికంగా శబ్దం వచ్చే సైలెన్సర్లు



అధిక శబ్దం చేసే సైలెన్సర్ ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

- అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఉంటే చర్యలు
- నగరంలో వాహనాల తనిఖీలు

కంబాలచెరువు: బిగ్గరగా శబ్దం చేసే సైలెన్సర్లతో వాహనాలను నడపడం కొందరు యువతకు సరదాగా మారింది. దీనివల్ల వారికి లభించే వినోదం మాట ఎలాగున్నా... ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆకతాయి యువతకు ముకుతాడు వేసేలా జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలో పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టారు. గతంలోనూ ఈ విధంగా ప్రవరిస్తున్న వారి ద్విచక్ర వాహనాలను గుర్తించి వారితో దానికున్న సైలెన్సర్లను తీయించి రోడ్డు రోలర్‌తో తొక్కించేవారు. ఈ విధానం ఇక నుంచి నిరంతరం చేసే దిశగా పోలీసులు ముందుకు కదలారు. దీనిపై నిత్యం సైలెన్సర్ డ్రైవ్ చేపట్టనున్నారు. దీనికి ట్రాఫిక్ పోలీసులు నడుం బిగించారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది కలసి పనిచేయనున్నారు. అధిక శబ్దం వచ్చే విధంగా ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లను అమర్చుకుని శబ్ద కాలుష్యం కలిగించే మోటార్ సైకిళ్లను డిజిటల్ నాయిస్ లెవెల్ మీటర్ ద్వారా చెక్ చేస్తారు. 80 డేసిబుల్స్‌పై శబ్దం కలిగించే వాహనాలను గుర్తించి వారిపై వాహన చట్టం యూఎస్ 190/2 ప్రకారం కేసులు నమోదు చేయనున్నారు. ఈ రెండు రోజుల్లో సుమారు 20 పైగా వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు.

బిగించే వారిపైనా కేసులు

రణగొణ ధ్వనులు చేసే విధంగా సైలెన్సర్లు బిగించుకుని తిరిగే వాహన చోదకులతో పాటు వాటిని బిగిస్తున్న మెకానిక్‌లను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఎస్పీ పోలీసు అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా అధిక శబ్దం చేసే సైలెన్సర్‌ను బిగించాలని వస్తే వారికి కౌన్సిలింగ్ చేసే విధంగా మెకానిక్‌లు ఉండాలని ఆయన సూచించారు.

పర్యవేక్షణ

నగరంలో ట్రాఫిక్ సమస్య, నగరాభివృద్ధి నేపథ్యంలో ట్రాఫిక్ కొంత మేర ఇబ్బంది ఏర్పడుతోంది. దీనికి తోడు రాంగ్ రూట్‌లో వచ్చే వారితో ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు రాంగ్ రూట్‌లో వచ్చే వాహన చోదకులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నారు. రాంగ్ రూట్ డ్రైవింగ్‌కు అవకాశం ఉన్న ప్రాంతాలలో పోలీసు సిబ్బందిని నియమించి నిత్య పర్యవేక్షణ చేస్తున్నారు.

నిత్యం ప్రత్యేక తనిఖీలు



రాజమహేంద్రవరం పరిధిలో ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయి. అధిక శబ్దం చేసే సైలెన్సర్లను మోటార్ సైకిల్ కు అమర్చరాదు. ఈ శబ్ద కాలుష్యం వల్ల తోటి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడతారు. వీటిని బిగించే మోటార్ సైకిల్ మెకానిక్‌లపైనా చర్యలు తీసుకుంటాం. మోటారు వాహనాల చట్టం ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

– ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ, రాజమహేంద్రవరం

గౌతమీ గ్రంథాలయం అభివృద్ధికి చర్యలు



రుడా చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రంథాలయాధికారి

ప్రకాశం నగర్: గౌతమీ గ్రంథాలయం అభివృద్ధికి చర్యలు చేపడతామని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆయన సోమవారం ఆ గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడి వివిధ విభాగాలను, డిజిటలైజేషన్ విభాగాన్ని పరిశీలించారు. తదుపరి గుడా నిధులతో ప్రారంభమై సగంలో ఆగిపోయిన గ్రంథాలయం భవనం పైఅంతస్తును పరిశీలించారు. ఈ మేరకు గ్రంథాలయ అధికారి జి. శ్రీదేవి వినతి పత్రం సమర్పించారు.

ఇద్దరు సీఐల బదిలీ

కంబాలచెరువు: జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్ సీఐగా పని చేస్తున్న ఆర్.విజయ్‌కుమార్, రాజమహేంద్రవరం రెండో పట్టణ సీఐగా పని చేస్తున్న టి.గణేష్‌ను విజయవాడ ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు మంత్రి వేణు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పురోగతిని వేగవంతం చేయాలని, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, డీఆర్‌ఓ ఇతర జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో సోమవారం సమీక్షించారు. నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టి అమలు చేస్తున్న పనులు పురోగతిపై ఆరా తీశారు.

త్వరితగతిన..

మంత్రి వేణు మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టి అమలు చేస్తున్న పనులను జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, ఆయా ప్రాంతాల అభివృద్ధికి నాయకులు ఇచ్చే ఆదేశాన్ని త్వరితగతిన అమలు చేస్తే, ప్రజలు ఆ ప్రభుత్వానికి మరో అవకాశాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ పిల్లవాడు బాల కార్మికుడిగా ఉండకూడదన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. జలజీవన్ మిషన్ అభివృద్ధి పనులపై సమీక్షిస్తూ ప్రారంభించిన ప్రతి పని పూర్తి చేయాలన్నారు.

1,864 గృహాలు పూర్తి

నియోజకవర్గంలోని నాలుగు లేఅవుట్లలో 5,431 ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణం పనులు ప్రారంభించగా, ఇప్పటి వరకూ 1,864 గృహాలు పూర్తయ్యాయని, మిగిలిన గృహాల నిర్మాణాల పురోగతిలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. అసంపూర్తిగా మిగిలిన చిన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్నెస్ సెంటర్లు, నాడు – నేడు పనులపై ఆరా తీశారు. సమావేశంలో జాయింట్ ఎస్.తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, డీఆర్‌ఓ జె.నరసింహులు, ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, సీపీఓ ఎల్.అప్పలకొండ పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు

- ఎంపీ భరత్ రామ్
- ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ ముఖద్వార నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ/ సీటీఆర్ఐ: నగరంలోని ప్రసిద్ధ పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక కోటిలింగాలపేట ఉమా కోటిలింగేశ్వర స్వామి, సీతారామ స్వామి వార్ల దేవస్థానం ముఖ ద్వార నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ ముఖ ద్వారాన్ని ఆలయ పాలక వర్గ చైర్మన్ అరిగెల బాబూ నాగేంద్ర ప్రసాద్ (బాబు) తన తండ్రి దివంగత అరిగెల సత్యనారాయణ మూర్తి (బియ్యం కొట్టు సత్యం) జ్ఞాపకార్థం నిర్మిస్తున్నారు. ముఖ ద్వార శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన అరిగెల బాబు, ఆలయ పాలక మండలి సభ్యులను అభినందించారు. ఇదే రీతిలో నగరంలోనిఉమా మార్కండేయేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి దేవస్థానాల ముఖద్వారాలను కూడా నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్, కట్టా వెంకటేష్, ఉదయ్ రాణా, ఉల్లూరి రాజు, నడివాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో రజకుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎంపీ మార్గాని భరత్ రామ్ హామీ ఇచ్చారు. సోమవారం కోటిలింగాలపేటలో రజకులకు విశ్రాంతిశాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజకులు ఆర్థికంగా చైతన్యవంతులు అయ్యేందుకు జగనన్న పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బ్రాహ్మణులు పిండ ప్రదాన తదితర పితృదేవతా కార్యక్రమాలు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక షెడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. నగరంలో సులభ్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న సిబ్బంది తమకు 8 నెలలుగా వేతనాలు అందడం లేదని ఎంపీ భరత్ రామ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంటనే సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేసి, వేతనాలు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. సాయంత్రానికి కల్లా నాలుగు నెలల వేతనం ఇవ్వాలని ఆదేశించారు. నాలుగు నెలల వేతనాన్ని ఇచ్చేందుకు ఒక నెల రోజులు వ్యవధి కావాలని కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వాహకులు ఎంపీని కోరారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- పేద పిల్లలకు ఉన్నత చదువు అందించడమే సీఎం జగన్ లక్ష్యం
- ట్యాబ్‌ల పంపిణీలో ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్ రామ్



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంపీ భరత్ రామ్

కంబాలచెరువు: పేదల విద్యార్థులకు ఉన్నత చదువు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం ఉదయం అర్బన్ మండలంలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రభుత్వం సమకూర్చిన సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతికి రావాలన్నారు. నాలుగేళ్లగా విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాల కారణంగానే నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేరళను దాటి అక్షరాస్యత రేటులో మొదటి స్థానంలో ఉందన్నారు. 8వ తరగతి విద్యార్థులకు సుమారు రూ.17,500 విలువగల ట్యాబ్‌లను రూ.15,500 విలువైన బైజూస్ కంటెంట్ తో కలిపి అందిస్తున్నామన్నారు. వీరు పైతరగతులకు వెళ్లినప్పుడు కూడా ఉపయోగపడేలా తొమ్మిది, పది తరగతుల బైజుస్ కంటెంట్ కూడా లోడ్ చేసి ఇస్తున్నారన్నారు. ఈ ఏడాది ఇచ్చే ట్యాబ్‌ల్లో 11, 12 తరగతుల సబ్జెక్ట్‌లు కూడా అవసరాన్ని బట్టి లోడు చేసుకునేందుకు వీలుగా మెమరీ కార్డ్ సామర్థ్యాన్ని 256 జీబీకి పెంచి అందజేస్తున్నారన్నారు. అలాగే సంక్రాంతికి సుబ్రహ్మణ్య మైదానంలో ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఓపెన్ ఆడిటోరియం, అంబి థియేటర్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతి రోజూ సాయంత్రం ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉచితంగా సినిమాలు చూడవచ్చన్నారు.

2,123 మందికి ట్యాబ్‌లు

అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అర్బన్ మండలంలో 2023, 24 విద్యాసంవత్సరానికి రెండో విడత 2,123 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నామన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.కార్యక్రమంతో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, అర్బన్ ఎంఈవో 2 రమారజని, కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల హెచ్ఎం పులుగుర్త దుర్గాప్రసాద్, సిటీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న స్టాలిన్

కడియం: ఆధునిక సాంకేతికతను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. జీవీకే హైస్కూలు విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సోమవారం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు



బొమ్మూరులో పార్టీ పతకాన్ని ఎగురవేస్తున్న విష్ణుమూర్తి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాలని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. బొమ్మూరు సచివాలయం–2లో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును ఆయన, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సోమనవారితోటలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పార్టీ శ్రేణులతో కలిసి మానమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

అనంతరం పార్టీ నాయకుడు తోడేటి రాజా నివాసంలో ఇష్టాగోష్టి నిర్వహించి సహపంక్తి భోజనం చేసి పల్లెనిద్ర చేశారు. సచివాలయ కన్వీనర్లు సోమన శ్రీనివాస్, మాలేటి రమేష్ యాదవ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, పార్టీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మేడపాటి సద్గుణ రామారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు, పార్టీ నాయకులు వైఎస్ కుమార్, వల్లి శ్రీను, కాకులపాటి కుమార్, సమీరా, దొడ్డి సత్యవేణి, రాహుల్, నూనె బలరాం, జిమ్మీ, పానుగంటి అనిల్, బందిలమణి, దీప్తి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు దృష్టికి ఉద్యోగుల డిమాండ్లు



మంత్రి వేణుకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

కంబాలచెరువు: సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల డిమాండ్లు ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్తామని మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదురుగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు సోమవారం మంత్రులు, ఎంపీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని, కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి వేతనాలు పెంచి ప్రతి నెలా ఒకటవ తేదీన విడుదల చేయాలని కోరారు.

పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



నాగరాజా స్కూల్లో సంక్రాంతి సంబరాలు



వేమగిరి స్కూల్లో భోగిమంట వేస్తున్న విద్యార్థులు



దుళ్లలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న చిన్నారులు

కంబాలచెరువు: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక నాగరాజా స్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. దిలీప్ కుమార్ మాట్లాడుతూ పండగలు, వాటి విశిష్టతలను తెలియజేసేలా ఏర్పాటు చేసిన కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ వేడుకను నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణిని అభినందించారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంస్కృతీ సంప్రదాయాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. వేమగిరితోట ప్రాథమిక పాఠశాలలో భోగిమంట వేశారు. రంగోలీ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్ఎం కె.జయరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.లజపతిరాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యాతం నాగమణి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దుళ్ల ప్రాథమిక పాఠశాలలో రంగవల్లుల పోటీలు జరిగాయి. ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. హెచ్ఎం ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని వెలుమూరి విస్టాస్ గేటెడ్ కమ్యూనిటీలో శ్రీవారి వైభోత్సవాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉదయం నుంచీ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అంతరాలయం, వివిధ నమూనా ఆలయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కళ్యాణ కర్తలుగా వెలుమూరి భీమశంకరరావు దంపతులు వ్యవహరించారు. ఉత్సవాల్లో భాగంగా భరతనాట్యం ప్రదర్శన, విష్ణుపారాయణ, భక్తి గీతాలాపన, కోలాటంతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పురవీధుల్లో స్వామి ఊరేగింపు వైభవంగా కొనసాగింది. కల్యాణోత్సవంలో ఎంపీ మార్గాని భరత్ రామ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకేరావు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. నిర్వాహకులు వెలుమూరి భీమశంకరరావు, లక్ష్మీసుచిత్ర, వెలుమూరి సత్యనారాయణమూర్తి, సుబ్బలక్ష్మి తదితరులు ఉత్సవాలను పర్యవేక్షించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



పుర వీధుల్లో ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

సినిమాలు



శ్యామల :	డెవిల్
సూర్యమినీ :	ఆక్వామేన్
సూర్యప్యాలెస్ :	యానిమల్
స్వామి :	హాయ్‌నాన్న
శివజ్యోతి :	మాయాబజార్
అనుశ్రీ :	డెవిల్
రాజా :	సలార్
అశోక :	సలార్
ఊర్వశి :	డెవిల్
రంభ :	బబుల్‌గమ్
మేనక :	ఆక్వామేన్
అప్సర :	కపాలదీవి
నామవరం	
వీఎస్ మహల్ :	సలార్, డెవిల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	డెవిల్
కడియం	
వెంకటసూర్య :	సలార్, డెవిల్